ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

# కోయ మౌఖిక సాహిత్యం

**అరెం అరుణ్ కుమార్**

పరిశోధక విద్యార్థి, ఓయూ

Article Received: 20/06/2025Article Accepted: 02/07/2025 Published Online: 03/07/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2319

**ఉపోద్ఘాతం:**

ఈ వ్యాసంలో కోయల మౌఖిక సాహిత్యపు ప్రత్యేకతలను విశ్లేషించారు. ప్రకృతితో అనుబంధంగా జీవించే ఆదివాసీ తెగలైన కోయల సాహిత్యం పూర్తిగా మౌఖికంగా కొనసాగుతూ వారి జీవనశైలి, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. పాటలు, కథలు, సామెతలు, పొడుపు కథలు వంటి మౌఖిక ప్రక్రియల ద్వారా కోయలు తమ భావోద్వేగాలు, నమ్మకాలు, సామాజిక జీవన విధానాన్ని తరతరాలుగా కొనసాగిస్తున్నారు. పని, పండుగ, ఆచారాల సందర్భాలలో పాడే పాటలు, జీవితాన్ని ప్రతిబింబించే కథలు, అనుభవాల్ని సంక్షిప్తంగా తెలిపే సామెతలు, తెలివితేటలు పరీక్షించే పొడుపు కథలు ఈ సాహిత్యంలో కీలకంగా నిలిచాయి. ఆధునికత ప్రభావంతో కోయ మౌఖిక సాహిత్యం మాయమవుతున్న నేపథ్యంలో, దాన్ని పరిరక్షించడం అనివార్యమని ఈ వ్యాసం సూచిస్తుంది.

**ముఖ్య పదాలు:**కోయ మౌఖిక సాహిత్యం,ఆదివాసీ సాంస్కృతిక జీవనం,పని పాటలు,మౌఖిక కథలు పొడుపు కథలు

ప్రకృతి మీద ఆధారపడి జీవించే ఆదివాసీ తెగలలో కోయలు ఒకరు. కోయ సాహిత్యంతా మౌఖికపరమైనది. కోయ భాషలో విస్తృతి చెందిన ఈ సాహిత్యం లిపి లేనందున మౌఖికంగా వ్యాప్తి చెందింది. కోయల మౌఖిక సాహిత్యం లిఖిత సాహిత్యానికి భిన్నమైనదే కాక ప్రాచీనమైనది కూడా. కోయల సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు, జీవనశైలి అంతా సాధారణ నాగరిక సంస్కృతికి భిన్నంగా ఉంటాయి. వీరి నమ్మకాలు, ఆచారాలు, ఆటలు, పాటలు, నృత్యాలు, వేషధారణ, జీవన విధానం మొదలైనవన్నీ తరతరాలుగా మౌఖికంగా ఒక తరం నుండి మరొక తరానికి అందించబడుతున్నాయి. ఈ మౌఖిక సాహిత్యం వారి సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. కోయల మౌఖిక సాహిత్యం పాటలు, కథలు, పురాణాలు, సామెతలు, పొడుపు కథలు ఇలా వివిధ రూపాలలో విస్తరించి ఉన్నాయి. ఏదైన ఒక

తెగ ఆచారాలు, నమ్మకాలు నాగరికత సంస్కృతికి భిన్నంగా ఉండి తరాల తరబడి మౌఖిక మార్గాల్లోనే కొనసాగుతూ ఉ న్నట్లయితే అది ఒక సంప్రదాయంగా స్థిరపడిపోతుంది. దాన్నే మౌఖిక సంప్రదాయం అంటారు.

ఆదిమానవుడి కాలం నుండి ఎన్నో యేళ్ళుగా కోయలు ప్రత్యేకమైన నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలలో జీవించడం వల్ల వీరి సాహిత్యం అంతా మౌఖిక సాహిత్యంగా వెలువడింది. కోయ మౌఖిక సాహిత్యాన్ని ప్రధానంగా నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి: 1) కోయ మౌఖిక గేయాలు 2) కోయ మౌఖిక కథలు 3) కోయ మౌఖిక పొడుపు కథలు 4) కోయ మౌఖిక సామెతలు.

కోయల పాటల్లో మౌఖిక పాట ఒక విశిష్ట సాహితీరూపం. అందుచేత ఏ ప్రక్రియ నశించినా పాట మాత్రం నశించదు. పాట జీవనది. మనిషి జీవన విధానంలో ఆట, పాట, పని, పాట అనే మాటలు పాటలతో, పనితో పాటకు గల సంబంధాన్ని మానవజాతి మహేతిహాసంలో చిరస్థాయిగా నిలబెడుతుంది. కోయ సమాజంలో మౌఖిక పాటలు ఒక ప్రత్యేకమైనవిగా గుర్తించబడుతున్నాయి. వీరి మౌఖిక సాహిత్యంలో అనేక రకాల పాటలు ప్రజల నాలుకలపై ఊటసెలిమెళ్ళా ప్రవహిస్తున్నాయి. అంతేకాకుండా వీరి దైనందిన జీవితంలో పాటలు అంతర్భాగాలుగా ఉంటావి. పండుగలు, పబ్బాలు, వివాహాలు, చావులు, వ్యవసాయ పనులు, వేట ఇలా ప్రతి సందర్భానికీ కోయల్లో ప్రత్యేకమైన పాటలు ఉంటాయి. అవి: పని పాటలు, ప్రేమ పాటలు, శృంగార పాటలు, స్మృతి పాటలు, జంతు పాటలు రకరకాల పాటలు కోయ సమాజంలో విరివిగా కనబడతాయి. ఈ పాటలు వారి భావోద్వేగాలను, నమ్మకాలను, సామాజిక కట్టుబాట్లను తెలియజేస్తాయి.

కోయలు జరుపుకునే ప్రతి పండుగకు, ఆచారానికి ప్రత్యేకమైన పాటలు ఉంటాయి. ఉదాహరణకు: భూమి పండుగ, విత్తనాల పండుగ, పచ్చ పండుగ, ఎన్నుకట్టు పండుగ, చిక్కుడు పండుగ, పంటకోతల పండుగ మొదలైన వాటికి సంబంధించిన పాటలు ఆయా సందర్భాల ప్రాముఖ్యతను వివరిస్తాయి. ఈ పాటలు కోయల చేత సామూహికంగా పాడబడతాయి. ఇవి వారిలో ఐక్యతను పెంపొందించడానికి దోహదం చేస్తాయి. తమ తెగ యొక్క పూర్వపు రాజులు, వీరులు, ముఖ్యమైన సంఘటనల గురించి, కోయలు పాటలు, కథల రూపంలో విరివిగా గుర్తు చేస్తాయి. ఈ గాథలు వారి గత వైభవాన్ని, తెగ యొక్క గుర్తింపును పెంపొందిస్తాయి.

కోయ మౌఖిక పాటలు సామూహికంగా వెలువడుతాయి. వీరి పాటలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. అవి: 1) పని పాటలు 2) విరామ పాటలు.

కోయ మౌఖిక సాహిత్యం లయాత్మకంగా ఉంటుంది. శ్రమలో లయ ఉంటుంది. ఊడ్పులు, కలుపుతీతలు, కోతలు, మార్పిడులు, విసరడం, దంచడం, రుబ్బడం, వేల్పు మోయడం, రాళ్ళుకొట్టడం, చెట్టునరకడం లాంటి పనుల్లో ఉండే లయకు అనుగుణంగా ఆయా పనిపాటలు ఉద్భవిస్తాయి. కోయలు పని చేసే సందర్భంలో పాడుకునే పాటలను పని పాటలు అంటారు. నాట్లు, కలుపు, కోతలు, కుప్పనూర్చడం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

మొదలైన సందర్భాలలో పాడే పాటలు సామూహిక స్వభావాన్ని కల్గి ఉంటాయి. ఇవి దంచడం, విసరడంలాంటి పనులు జరిగేటప్పటి పాటల కంటె భిన్నంగా ఉంటాయి. వ్యష్టి శ్రమతో సాగే పాటలు చిన్నవిగా ఉంటే సమిష్టి శ్రమతో సాగే పాటలు సుదీర్ఘంగా ఉంటాయి. వీరు పనుల్లో నీతికథలు, ఇలవేల్పు కథాగేయాలు, వీరుల చరిత్ర లాంటి పాటలు పాడుతారు. ఇందులో ముఖ్యంగా సమ్మక్క, సారక్క, నాగులమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజు మొదలైన ఇలవేల్పుల గురించి, వారి దేవతలను స్తుతిస్తూ పాడేవిగా ఉంటాయి. అంతేకాకుండా జంతు పాటలో "పెర్మాకోర్" మొదలగు పాటను పాడుతారు. పని పాటలన్ని పని సందర్భాలలో కూర్చబడినవే. ఆ పాటల్లో సమకాలీన విషయాలు, పరిసరాలలోని ప్రకృతి దృశ్యాలు, వివిధ పనుల్లో వాడే పనిముట్లు, వస్తువులు వర్ణించబడతాయి.

కోయ మౌఖిక సాహిత్యంలో పని పాటలతో పాటు విరామ పాటలు, పని లేని పాటలు వెలువడ్డాయి. ఇవి పనిలేని సమయాలలో సరదాగా, వ్రతాలు, పూజలు, పండుగలు, జాతరలు మొదలైన తంతుల కోసం కూర్చుకున్న పాటలు. పని పాటల్లో పనిముట్లు, పనిముట్లు చేసే ధ్వనులు, పనిముట్ల పనితీరు, అడుగులు, కట్టల చప్పుళ్ళు పాటలకు వాద్య సహకారం అందిస్తే, విరామ పాటల్లో చప్పట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయి. పండుగ పాటలలో చప్పట్లు ముఖ్యంగా ఒక లయను ఏర్పాటు చేస్తాయి. పెళ్ళి పాటలు, పురుడు పాటలు, లాలి పాటలు, జోల పాటలు, వదిన -మరదళ్ళ పాటలు, సరసాల పాటలు, అత్తకోడళ్ళ పాటలు, పిల్లల పాటలు ఇలా మైదలైన పాటలను వివిధ కార్యక్రమాలలో పాడుతారు.

కోయ మౌఖిక పాటలు, ఆటలు ప్రకృతి సిద్ధంగా సహజంగా ఆవిర్భావించబడతాయి. వీరి ప్రతి కదలికలో అందమైన అడుగులు సవ్వడులతో కూడిన సామూహిక పాటలు ఉ ంటాయి. కోయలు పాడే పాటలు ఆశువుగా, సుదీర్ఘంగా ఉంటాయి. కోయ మౌఖిక పాటలు రేల పదంతో ప్రారంభమవుతాయి. "రేల" అనగా "వెన్నెల" అని అర్థం. ప్రతి పాటలో రేల పదాన్ని రాగయుక్తంగా ఆలపిస్తారు. కోయలు వెన్నెల రాత్రులలో పాటలు పాడుతూ, డోలి వాయిస్తూ, సామూహిక నృత్యాలు చేస్తారు. వీరి నృత్యాలు చాలా కనువిందుగా, ఆకర్షణీయంగా ఉంటాయి. వీరు వాయించే వాద్యాలు కూడా వినసొంపుగా శబ్దాన్నిచ్చేవిగా ఉంటాయి.

కోయ మౌఖిక సాహిత్యంలో గల పండుగలకు సంబంధించిన పాటలన్నీ ప్రజలలో ఐక్యమత్యాన్ని పెంచుతాయి. అంతేకాక పండుగలు జరుపుకొనే విధానాన్ని, వాటి ప్రత్యేకతను తెలియజేస్తాయి. కోయల ఇళ్ళల్లో జరిపే తంతులకు సంబంధించిన పాటలన్నీ ఆ కార్యక్రమాలనీ, ఆ ఇంటి వాళ్ళనీ సమాజం గుర్తింపు పొందేలా చూస్తాయి.

కోయ మౌఖిక కథాసాహిత్యం చాలా ప్రాచీనమైనది. ఆదిమానవుడి కాలం నుంచి నేటి వరకు కథలు చెప్పడం అనే కళ కోయ మౌఖిక సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉ ంది. కోయలు తమ ఊహాకందని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

విషయాల గూర్చి కథలు కథలుగా చెప్పుకోవడమే కాక అద్భుత శక్తుల గురించి కథలుగా చెప్పేవారు. చెట్టు కథ, పుట్ట కథ, గుట్ట కథ ఇలా ప్రతి దానికి కథ చెప్పడం అతి ప్రాచీన కాలం నుంచే వారి జీవన విధానంలో భాగంగా వుంది. కోయ సమాజంలో చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు కథలు చెప్పడం సహజంగా అలవడుతుంది. ఇలా కథ చెప్పడం కోయ వారి జీవితాలలో శాశ్వతంగా పెనవేసుకున్న ప్రక్రియ. వీరు అడవిలో బతకడం కోసం జంతువులతో చేసే పోరాటాలను గురించి పుంకాలు పుంకాలుగా కథలు వెలువడ్డాయి. వీరి మౌఖిక కథలలో కోయల చరిత్రకు గల మూలాలు, వీరుల గాథలు, దేవుళ్ళు, దేవతలకు సంబంధించినవి అనేకం ఉంటాయి. నీతి కథలు, హాస్య కథలు, వీర కథలు, శృంగార కథలు, ప్రేమ కథలు, జంతువుల కథలు ఇలా పలురకాలు కథలు కూడా వారి మౌఖిక సాహిత్యంలో భాగంగా ఉన్నాయి. ఈ కథలు వినోదాన్ని పంచడమే కాకుండా, వారి సమాజానికి విలువలను, నైతికతను బోధిస్తాయి.

కోయ మౌఖిక సాహిత్యంలో పురాణాలు మరియు ఇతిహాసాలకు సంబంధించిన కథలు ఉన్నాయి. కోయలకు తమదైన సృష్టి పురాణాలు, వీరోచిత గాథలు కూడా ఉ న్నాయి. వారి దేవతల ఆవిర్భావం, ప్రకృతితో వారికి గల సంబంధం, తెగ యొక్క మూలాలను తెలిపే కథలు వారి సాహిత్యంలో విరివిగా కన్పిస్తాయి. ఇవి వారి మతపరమైన నమ్మకాలకు, విశ్వాసాలకు ఆధారం. పురాణ కథలలో ఈ సృష్టి ఎలా ఆవిర్భావం జరిగిందని చెప్పే కథలు, కోయ తెగ పుట్టుకకు సంబంధించిన కథలు, గట్టుగోత్రాలకు సంబంధించిన కథలు, మూల పురుషుల కథలు, ఇలవేల్పుల కథలు కోయ వారి అర్తిబిడ్డలు, తలపతుల ద్వారా చెప్పబడుతున్నాయి. వీరి పురాణ కథల్లో దేవుళ్ళను మూల పురుషులుగా చెప్తారు.

కోయ మౌఖిక కథకు వస్తువు ప్రకృతి మరియు కోయల జీవితాలు. వీరి కథలు ప్రకృతితో ముడిపడి ఉంటాయి. కోయ కథలలో పక్షులు, జంతువులు, దేవతలు, మానవతీతశక్తులు నాయికా, నాయకులుగా ప్రాధాన పాత్రలుగా ఉంటాయి. పనులు చేసే సందర్భాలలో శ్రమను మర్చిపోవడానికి పాటల రూపంలో కథలు పాడుతారు. చేసు గట్టు మీద కూర్చున కాడా, పని చేస్తూన్న కాడా సామూహికంగా ఒక చోట చేరి కోయలు కథలు చెప్పుకుంటారు.

కోయల మౌఖిక సాహిత్యంలో మరొక అంశం సామెతలు. సామెతలు వారి అనుభవ జ్ఞానాన్ని, లోకజ్ఞానాన్ని తెలియజేస్తాయి. వారి సామెతల్లో ఒక వ్యక్తి సంపూర్ణ జీవిత సారమంతా దాగి ఉంటుంది. తక్కువ పదాల్లో గొప్ప అర్థాన్ని బోధించే సామెతలు వారి సంభాషణల్లో తరచుగా కనిపిస్తాయి. కోయ సామెతలు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింస్తాయి, సామెతల్లో భాషా సౌందర్యం, అనుభవసారం, నీతి సూచన, హాస్యం కలగలిపి ఉంటాయి.

సామెతలను కోయ భాషలో "పూర్బం" మాట అని అంటారు. సామెతలను వీరు తమ జీవన విధానంలో సందర్భానుసారంగా ఉపయోగిస్తుంటారు. వారి ఉపయోగించే సామెతల్లో మానవసంబంధమైన

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

అంశాలు, వస్తు సంబంధమైన అంశాలు, ఆర్థిక సంబంధమైన అంశాలు, వారి స్థితిగతులకు సంబంధించిన అంశాలు ఉంటాయి. ప్రధానంగా సామెతలు కోయ సమాజంలో ప్రజల ఆలోచన విధానాలపై, సామాజిక అంశాలపై ప్రభావాన్ని చూపుతాయి. అంతేకాకుండా సామాజికపరమైన మార్పులు తీసుకురావడానికి ఈ సామెతలు ఉపయోగపడతాయి. ఉదాహరణ: "ఒక్కడే కొడుకని వత్తగిల్లేస్తే ఉడుమని కుక్క ఎత్తుకు పోయింది" అనే ఈ సామెతలో తల్లికి కొడుకు మీద ఉన్న ప్రేమ తెలియజేయబడుతుంది. "అశ్లేరుకి ముసలెద్దు రెంకలేస్తుంది" అనే సామెత కోయ వారి వ్యవసాయ పనులను తెలుపుతుంది. ఈ విధంగా కోయ మౌఖిక సామెతలు వారి జీవనశైలి తెలియజేస్తున్నాయి.

ఆదిమానవుడు తన సుఖదు:ఖాలను, కష్టానష్టాలను, సాదకబాధకాలను, అభివ్యక్తీకరించడానికి, అనుభవాలను ఎదుటివారికి తెలియజెప్పడానికి పాటలను, కథలను సామెతలను ఉపయోగిస్తున్నారు. "మౌలికమైన ప్రతిభాశక్తిని, కల్పనాశక్తి ఉండిన అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడనడంలో సందేహం లేదు" అని ఆర్వీయస్, సుందరం గారు జానపద సాహిత్యం స్వరూపం అనే పుస్తకంలో తెలియజేశాడు.

మౌఖిక సాహితీ ప్రక్రియలలో పొడుపు కథలు ముఖ్యమైనవి. ఎదుటి వారి తెలివితేటలను పరీక్షించడానికి అడిగే ప్రశ్నలను పొడుపు కథలు అంటారు. పొడుపు కథను కోయ భాషలో "పెసోడ్" కథలు అని అంటారు. ఇవి కోయ వారి సంస్కృతి సంప్రదాయాలను, జీవన స్థితిగతులను ప్రతిబింబించే విధంగా ఉంటాయి, అంతేకాకుండా పొడుపు కథలు వారి మేధస్సును, పరిశీలనా శక్తిని సూచిస్తాయి. పొడుపు కథలు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తాయి. కోయలు చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా చెప్పకుండా పొడుపు కథల ద్వారా చెప్తుంటారు. ఈ పొడుపు కథలు గేయరూపంలో, కథాగేయరూపంలో, కథారూపంలో, సామెతల రూపంలో ఉంటాయి.

పొడుపు కథలకు మూలాధారం మానవ జీవితాలు. నిరక్షరాసులు, విద్యావంతులు అనే తేడా లేకుండా అందరు పొడుపు కథలను ఉపయోగించడం వల్ల మనిషి జీవితాలపై ఇవి ఎంతో ప్రభావాన్ని చూపుతాయని తెలుసుకోవచ్చు. ప్రజల నాలుకల మీద నిత్యం వెలువడే పొడుపు కథలను పిల్లలు, పెద్దలు, మహిళలు సందర్భానుకూలంగా వాడతారు. కోయలు ఎక్కువగా పంచాయితీ తీర్పుల సందర్భంలో పొడుపు కథలను ఉపయోగిస్తారు. జీవితకాలంలో ఎదురైన సంఘటనలు, పరిస్థితులు నుండి, నేర్చుకున్న అనుభావాల నుంచి కొత్త కొత్త పొడుపు కథలను తయారుచేస్తారు. వీరు పొడుపు కథలను వివాహ సందర్భాలలో, పండుగ సందర్భాలలో, పంటలు పండడం కోసం, వాన రావడం కోసం మొదలైన సందర్భాలలో వాడతారు. కోయ సామాజంలో ఉన్న పొడుపు కథలను కుటుంబ సంబంధమైన పొడుపు కథలుగా, వ్యవసాయ సంబంధమైన పొడుపు కథలుగా, వస్తు సంబంధమైన పొడుపు కథలుగా, పశుపక్ష్యాదులు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

సంబంధమైన పొడుపు కథలుగా విభజించడం జరుగుతుంది. ఉదాహరణ: “తల్లి కాలుతుంటే పిల్ల ఉడుకుతుంది, మా తల్లిదండ్రులు ముల్లుకు ముల్లు నాట పోయారు, వస్తేరారు, రాకుంటే వస్తరు", "సందెకాడ పెండ్లామే, సగం రేతిరికి గర్భమాయే, కోడి కూతకి బిడ్డ పుట్టె, తెల్లారగానే పేరు పెట్టే" మొదలైన పొడుపు కథలు కోయ జీవితాలను, వారి ఔనత్యాన్ని చాటుతాయి.

కోయ మౌఖిక సాహిత్యం ప్రజల మీద ఎంతో ప్రభావం చూపుతుంది, ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తుంది. మౌఖిక సాహిత్యం ప్రజల్లో చలనం, చైతన్యం, సంస్కారం కలిగిస్తుంది. ఈ విషయంలో లిఖిత సాహిత్యం కంటే మౌఖిక సాహిత్యం మరింత చురుకుగా పనిచేస్తుంది. కోయ మౌఖిక సాహత్యం కాలంతోపాటే మారుతోంది. మారుతున్న విలువల్ని తనలో ఇముడ్చుకుంటూ ముందుకు సాగుతుంది. ఈ మౌఖిక సాహిత్యం కోయల జీవనానికి ఒక దర్పణం లాంటిది. దురదృష్టవశాత్తు, ఆధునిక పోకడల కారణంగా కోయల మౌఖిక సాహిత్యం ప్రస్తుత కాలంలో కనుమరుగవుతుంది. దీనిని పరిరక్షించి, భావితరాలకు అందించడం ఆవశ్యం.

**ఉపయుక్త గ్రంథ సూచిక:**

1. మౌఖిక సాహిత్యం గరికపాటి నరిసింహారావు

2. తెలుగులో ప్రగతిశీల కథాసాహిత్యం డా॥ కాలువ మల్లయ్య

3. తెలుగు గిరిజనుల గీతాలు డా॥ పిరాట్ల శివరామకృష్ణ

4. తెలుగు జానపద విజ్ఞానం సమాజం సంస్కృతి సాహిత్యం ఆచార్య నాయిని కృష్ణకుమారి

5. ఆంధ్రుల జానపద విజ్ఞానం డా॥ ఆర్వీయస్ సుందరం

6. కోయ తెగ సంస్కృతి - భద్రాచలం గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థ